జీవన నైపుణ్యాలతో మంచి భవిష్యత్

శ్రీకాకుళం : జీవన నైపుణ్యాలు పెంపొందించుకుంటే భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం 'ఉన్నతి' పేరుతో 31 రోజుల పాటు నిర్వహించిన సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. సాఫ్ట్ స్కిల్స్ పెంచుకునేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. శిక్షణా కార్యక్రమంలో రంజిత్ కుమార్, నిస్సి గ్రేస్ తదితరులు శిక్షకులుగా వ్యవహరించారు. జెకెసి, ఎన్ఎక్స్‌టి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెకెసి కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యుఏసి కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కళాశాల అధ్యాపకులు విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రకృతి కరుణించక, ప్రభుత్వం వైఫల్యం కొంత కలిసి అన్నదాతలకు ఈ ఖరీఫ్‌లో కష్టాలనే మిగల్చుతున్నాయి. వర్షాలు తగినంతగా లేకపోవడంతో జిల్లాలో ఇప్పటికీ రైతులు పూర్తిస్థాయిలో విత్తనాలు వేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాధారంపై ఆధారపడిన మెట్ట ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులే సాగునీటి కాలువ కింద ఉన్న ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఒడిశాలో కాస్తాకూస్తో వర్షాలు పడుతుండడంతో హిరమండలం గొట్టాబ్యారేజీ వద్ద తగినంత నీటి నిల్వలు ఉండనే ఉన్నాయి. కాలువల్లోకి నీటిని విడిచిపెడుతున్నా అవి శివారు భూములను చేరడం లేదు. కాలువల్లో పెద్దఎత్తున పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వంశధార కాలువలు ఉండి పంటలు ఎండిపోతున్నాయంటూ ఇటీవల ఈ ప్రాంత రైతులు నరసన్నపేట నీటిపారుదలశాఖ కార్యాలయాన్ని ముట్టడించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.

పోలాకి మండలం చల్లబందలో ఎండిపోయిన నారుమళ్లు

వంశధార రాక... ముందుకు సాగు లేక...

- ఆయుకట్టు రైతులకూ తప్పని కష్టాలు
- పూర్తిస్థాయిలో విత్తనాలు వేయలేకపోయిన అన్నదాతలు
- కాలువల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్క, పూడిక
- వర్షాల్లేక, కాలువల నీరు రాక ఎండిపోతున్న పంటలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం గొట్టాబ్యారేజీ ద్వారా వంశధార కుడి, ఎడమ కాలువల కింద 2.50 లక్షల ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. ఇందులో ఎడమ కాలువ ద్వారా 1.70 లక్షల ఎకరాలు, కుడి కాలువ ద్వారా 80 వేల ఎకరాలకు నీటిని అందించాల్సి ఉంది. కొద్ది సంవత్సరాలుగా ఎప్పుడూ పూర్తిస్థాయిలో నీరు ఇచ్చిన దాఖలాల్లేవు.

ఎడమ కాలువ కింద వరి సాగు పరిస్థితి ఇలా...

వంశధార ఎడమ కాలువ పరిధిలో 12 మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో వరి పంట లక్ష్యం, ఇప్పటివరకు సాగైన విస్తీర్ణం ఇలా ఉన్నాయి.

మండలం	వరి లక్ష్యం (ఎకరాల్లో)	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
జలుమూరు	21,018	18,913
సారవకోట	16,468	15,125
హిరమండలం	5,637	4,761
పోలాకి	20,178	17,538
నరసన్నపేట	19,348	17,075
కోటబొమ్మాళి	17,715	12,750
సంతబొమ్మాళి	19,865	16,280
పలాస	11,500	10,488
వజ్రపుకొత్తూరు	6,718	5,933
టెక్కలి	17,830	16,200
నందిగాం	20,168	19,160
మెళియాపుట్టి	18,225	14,775

కుడి కాలువ కింద వరి సాగు పరిస్థితి ఇలా...

కుడి కాలువ పరిధిలో ఏడు మండలాలు ఉన్నాయి. ఆయా మండలాల్లో వరి పంట లక్ష్యం, ఇప్పటివరకు సాగైన విస్తీర్ణం ఇలా ఉన్నాయి.

మండలం	వరి లక్ష్యం (ఎకరాల్లో)	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
హిరమండలం	2,818	2,381
ఎల్ఎన్‌పేట	10,935	9,850
సరుబుజ్జిలి	13,130	11,810
బూర్జ	12,600	10,125
ఆమదాలవలస	13,155	11,358
శ్రీకాకుళం	18,178	15,105
గార	17,578	16,725

వంశధార ఎడమ కాలువ సామర్థ్యం 2,450 క్యూసెక్కులు కాగా, కాలువ గట్లు బలహీనంగా ఉండడంతో రెండు వేల క్యూసెక్కులకు మించి నీరు విడిచిపెట్టడం లేదు. కుడి కాలువ సామర్థ్యం 800 క్యూసెక్కులు కాగా 600 క్యూసెక్కులకు మించి వదలడం లేదు.

పెండింగ్‌లో పనులు...

శివారు రైతులకు కష్టాలు

సాగునీటి కాలువలు చాలా బలహీనంగా ఉండడం, కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క పేరుకుపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. వంశధార కుడి, ఎడమ కాలువల్లో పెద్దఎత్తున గుర్రపుడెక్క, పూడిక పేరుకుపోయింది. వీటి తొలగింపునకు నిధులు కావాలంటూ వంశధార ఇంజినీరింగ్ అధికారులు ప్రభుత్వానికి రెండేళ్ల కిందటే రూ.మూడు కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు ఆ ఫైల్‌కు ఆమోదం తెలపలేదు. శివారు భూములకు నీరందడం లేదని రైతుల నుంచి తీవ్ర ఒత్తిళ్లు రావడంతో గతేడాది కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ రూ.40 లక్షలు కేటాయించారు. వాటితో పాక్షికంగా తొలగించారు. ఈ సంవత్సరానికి సంబంధించి జూలై మూడో వారంలో రూ.50 లక్షలు విడుదల చేశారు. ఇప్పటికీ ఆ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దాని ఫలితమే నేడు శివారు భూముల రైతుల కష్టాలకు కారణంగా నిలిచింది.

ప్రయాణికుల సౌకర్యాలకు ప్రాధాన్యత

ఈస్ట్‌కోస్ట్ రైల్వే జిఎంను కోరిన ఎంపీ రామ్మోహన్ నాయుడు

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని రైల్వే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో గురువారం నిర్వహించిన 10వ జోనల్ వినియోగదారుల సంప్రదింపుల కమిటీ మొదటి సమావేశంలో అనేక అంశాలపై చర్చించారు. అనంతరం ఈస్ట్‌కోస్ట్ రైల్వే జిఎం మనోజ్‌శర్మను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా మీదుగా రాకపోకలు సాగించే సూపర్‌ఫాస్ట్ రైళ్లకు హాల్ట్ సౌకర్యం కల్పించాలన్నారు. రైళ్లలో స్లీపర్ కోచ్‌లు తగ్గించడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని విశాఖ ఎక్స్‌ప్రెస్‌తో పాటు మిగతా రైళ్లలో స్లీపర్ క్లాస్ కోచ్‌లను పెంచాలన్నారు. శ్రీకాకుళం-సికింద్రాబాద్ మధ్య కొత్త రైతుల ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్‌లో రెండో కాలినడక వంతెన, ఇందిరాగాంధీ విగ్రహం వద్ద మూసివేసిన ఎలెసి గేట్ స్థానంలో కాలినడక వంతెన, పలాస రైల్వేస్టేషన్‌లో మూసివేసిన కాలినడక వంతెన, జాడుపూడి రైల్వేస్టేషన్ కాలినడక వంతెన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. శ్రీకాకుళం రోడ్డు స్టేషన్‌లో అమృత్ భారత్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనుల్లో మొదటి ప్లాట్‌ఫారానికి నేరుగా ప్రవేశం కల్పించాలని కోరారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ వద్ద కొలిగాం వైపు వెళ్లే కాలినడక వంతెన నిరుపయోగంలో ఉందని, తక్షణమే మరమ్మతు పనులు పూర్తి చేసి ద్విచక్ర వాహనాల రాకపోకలకు అనువుగా నిర్మించాలని కోరారు. విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును నడిపి శ్రీకాకుళం రోడ్డులో హాల్ట్ ఇవ్వాలని కోరారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖపట్నం - వారణాసి మధ్య నడుపుతున్న స్పెషల్ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను రెగ్యులర్ వీక్లీ/బై-వీక్లీ రైలుగా నడపాలని కోరారు. విశాఖపట్నం తిరుపతి, తిరుపతి-విశాఖపట్నం మధ్య నడుస్తున్న తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలును శ్రీకాకుళం వరకు పొడిగించాలని కోరారు. విశాఖపట్నం - పలాస -విశాఖపట్నం మధ్య నడుస్తున్న రైలును ఇచ్ఛాపురం వరకు భువనేశ్వర్-పలాస-భువనేశ్వర్ మధ్య నడుస్తున్న రైలును శ్రీకాకుళం రోడ్డు వరకు పొడిగించాలని కోరారు. ఆమదాలవలసలో షుగర్ ఫ్యాక్టరీ వద్ద అలికాం - బత్తిలి రోడ్ లో గల ఎలెసి గేట్ ను మూసివేసి, దాని స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. టెక్కలి పట్టణంలో ఇందిరాగాంధీ విగ్రహం, పాత జాతీయ రహదారిపై ఉన్న ఎలెసి గేట్ స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని కోరారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో హౌరా - బెంగళూరు - హౌరా ఎక్స్‌ప్రెస్ హాల్ట్, పాతపట్నం రైల్వేస్టేషన్‌లో గుణుపూర్-రూర్కెలా-గుణుపూర్ మధ్య నడుస్తున్న రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ హాల్ట్ కోసం ప్రస్తావించారు. లుకలాం, కామేశ్వరిపేట రిక్వెస్ట్ స్టాప్‌లను పునరుద్ధరించాలని కోరారు.

ఆ నోటిఫికేషన్‌తో బిఆర్‌ఎయుకు సంబంధం లేదు

శ్రీకాకుళం : పలు ఉద్యోగాల భర్తీ కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ పేరుతో సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న నోటిఫికేషన్‌తో బిఆర్‌ఎయు (శ్రీకాకుళం)కు ఎటువంటి సంబంధం లేదని యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్.ఎ రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ అలెర్ట్ పేరుతో సోషల్ మీడియాలో వస్తున్న ఉద్యోగాల నోటిఫికేషన్ ఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ జారీ చేసిన ప్రకటనగా అభ్యర్థులు గుర్తించాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అభ్యంతరాలు తెలియజేయండి

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా-2024 ప్రక్రియలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీకేష్ లాఠకర్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని పలు రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఈనెల 14న 5,850 కంట్రోల్ యూనిట్లు రానున్నట్లు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి తెలిపారని చెప్పారు. యూనిట్లు స్వీకరించే సమయాన్ని ముందుగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియజేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల రెగ్యులరైజేషన్ ప్రక్రియలో భాగంగా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో అన్ని పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈనెల 15న డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వివరాలను అందజేయనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ఈనెల 20న అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అందులో ప్రతినిధుల అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి ఏమైనా సమస్యలు తమ దృష్టికి వస్తే వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఇప్పిలికి చెందిన బిఎల్‌ఒలు విధులను సక్రమంగా నిర్వహించడం లేదని బిజెపి ప్రతినిధి ఫిర్యాదు చేశారు. ఓటర్ల జాబితాలోని తొలగింపులు, డూప్లికేట్ ఓటర్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని టిడిపి ప్రతినిధి కోరారు. జిల్లాలో వచ్చిన అన్ని క్లయిమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేసేలా సంబంధిత తహశీల్దార్లను ఆదేశించామన్నారు. బిఎల్‌ఒ యాప్‌లోని అన్ని చేర్పులు, తొలగింపులు, సవరణ ఓటర్ల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని తెలిపామన్నారు. తొలగింపులు, కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను మరోమారు పున:పరిశీలన చేసి సరిచేసిన వాటిని జాబితాలోకి తీసుకోవాలని స్పష్టం చేసినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.మురళీకృష్ణ, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి జగన్ ప్రమాదకరం

- ఇంటికి సాగనంపాలి
- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి ప్రమాదకరమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వాన్ని సాగనంపాలని పిలుపునిచ్చారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టెక్కలి నియోజకవర్గ టిడిపి నాయకులు, క్లస్టర్, బూత్ లెవల్, యూనిట్ ఇన్‌ఛార్జీలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లోనూ వెనుకబడిందని విమర్శించారు. ఎక్కడా అభివృద్ధి జాడే లేకుండా పోయిందన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడం ద్వారానే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ ఇన్‌ఛార్జీలు ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ అందించబోయే పథకాలను ప్రమాణపత్రం ద్వారా ప్రజలకు అందించాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే టిడిపి ప్రజలకు అందించే సంక్షేమ పథకాలు ఇవీ అని వివరించాలన్నారు. తెలుగుదేశం పార్టీ ఇస్తున్న ఐదు కోట్ల ఆంధ్రుల భవిష్యత్‌కి బాబు గ్యారంటీ అని అన్నారు. మహాశక్తితో మహిళలకు భరోసాగా నిలుస్తారని తెలిపారు. అనంతరం పార్టీ కార్యాలయ అవరణలో నూతనంగా నిర్మించిన అన్నా క్యాంటీన్ సముదాయం గల షెడ్‌ను అచ్చెన్నాయుడు ప్రారంభించారు. అనంతరం ఇటీవల నిర్వహించిన సంతబొమ్మాళి పంచాయతీ ఎన్నికల్లో 12వ వార్డు మెంబర్‌గా గెలుపొందిన టిడిపి నాయకులు చమళ్ళ అనసూయమ్మను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల అధ్యక్షులు బోయిన రమేష్, మాజీ ఎంపిపిలు వెలమల విజయలక్ష్మి, టి.రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, నాయకులు కె.నాగయ్యరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, దేవాది సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

ప్రజా సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డులో నూతనంగా మంజూరైన మండలం, మున్సిపాలిటీకి చెందిన 267 పింఛన్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులం, మతం, ప్రాంతం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. గతంలో పెన్షన్ రావాలంటే అధికార పార్టీ నాయకుల సిఫార్సులు కావాల్సి ఉండేదని, నేడు ఆ పరిస్థితి లేదన్న విషయాన్ని ప్రజలందరూ గమనించాలని కోరారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేరువవుతున్నాయని చెప్పారు. గ్రామ సచివాలయాల ద్వారా అర్హులకు సకాలంలో సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా అర్హులకు సంక్షేమ పథకాలు నేడు అందుతున్నాయని తెలిపారు. గతంలో మాదిరి కాకుండా ప్రతినెల ఒకటో తేదీనే సామాజిక పెన్షన్లు వాలంటీర్ల ద్వారా ఠంచన్‌గా అందుతున్నాయన్నారు. ప్రజలందరూ మరోసారి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గెలిపించుకొని సంక్షేమ పథకాలు, అభివృద్ధిని రాష్ట్రంలో కొనసాగేలా దీవించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, జెడ్‌పిటిసి బెండి గోవిందరావు, ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, డిసిసిబి డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు, సచివాలయాల కోఆర్డినేటర్లు బొడ్డేపల్లి నిరంజన్‌బాబు, అత్తులూరి రవికాంత్, సర్పంచ్‌లు చిలకలపల్లి సురేష్, ఎన్ని రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కాటేజీలను పరిశీలిస్తున్న మాల్‌రెడ్డి

పర్యాటకంతోనే అభివృద్ధి

- ఉపాధి, ఉద్యోగావకాశాల కల్పనకు తోడ్పాటు
- పర్యాటక శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.మాల్‌రెడ్డి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో ఎన్నో ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, వాటిని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పర్యాటకశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.మాల్‌రెడ్డి తెలిపారు. గార మండలం శాలిహుండంలోని బౌద్ధారామం, వేణుగోపాల స్వామి ఆలయం వద్ద నిర్మించిన వసతి గదులను పరిశీలించారు. వీటిని త్వరితగతిన పూర్తి చేసి పర్యాటకులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టాలని ఇంజినీర్లను ఆదేశించారు. టూరిజం రిసార్ట్సును అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కళింగపట్నం బీచ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళింగపట్నం బీచ్‌ను పర్యాటకులను ఆకట్టుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకులకు అనుగుణంగా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. వాటికి సంబంధించి ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. పర్యాటకరంగం వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. పర్యాటకాభివృద్ధితో ఆదాయ వనరులు సమకూరడంతో పాటు యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. యువ పర్యాటక క్లబ్‌ల ఏర్పాటు వల్ల పర్యాటక ప్రదేశాలకు విస్తృత ప్రచారం లభిస్తుందన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు శాలిహుండం, కళింగపట్నంలో పర్యాటకుల సంఖ్య వివరాలను జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావును అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పర్యాటకశాఖ ఇఇ రమణ, డిఇ స్వామి, ఎఇ సీతారాం, వర్క్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానంతోనే విశ్వ విజేత

- లక్ష్యం ఉంటే ఉన్నత శిఖరాలను చేరుకోగలం
- అస్సాం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కోత రవి

ప్రజాశక్తి - నౌపడ

విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపికను అందిస్తున్న కోత రవి

విజ్ఞానంతోనే విశ్వ విజేతలం కాగలమని, ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యం పెట్టుకుంటే అనుకున్న లక్ష్యానికి చేరుకోగలమని అస్సాం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సీనియర్ ఐఎఎస్ అధికారి కోత రవి అన్నారు. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కోత అప్పన్న, మహాలక్ష్మి మెమోరియల్ వలంటీర్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో కోత అప్పోజీ, సన్యాసమ్మ, లమ్మత చిన్నయ్య, నారాయణమ్మ మెమోరియల్ ప్రతిభా పురస్కారాలను విద్యార్థులకు అందించే కార్యక్రమంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి సంవత్సరం అందింతే ఈ స్కాలర్ షిప్పులు ఈ ఏడాది ఆరుగురికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1981లో పదో తరగతి ఇదే పాఠశాలలో చదివానని, ఒక లక్ష్యంతో చదివితే తప్పక మంచి ఫలితాలు సాధిస్తారని విద్యార్థులకు సూచించారు. నేటి సమాజంలో అవకాశాలతో పాటు సవాళ్లుకూడా ఉన్నాయని, వాటిని ధీటుగా ఎదుర్కోవాలని సూచించారు. దేశ భవిష్యత్తు అంతా నేటి యువతపై ఆధారపడి ఉందని, దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. పాఠశాలలో 2022-23 సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నగదు పురస్కారాలు అందుకున్న ఆరుగురిలో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి, జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది ఆయన్ని దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాబార్డ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ నాగార్జున, స్థానిక ప్రజా ప్రతినిధులు మార్పు అశోక్, చక్రవర్తి, అప్పలస్వామి, అప్పలరాజు, వసంతరావు, సతీష్‌లతోపాటు సంస్థ సభ్యులు కోత మధుసూదనరావు, కోత ధర్మారావు, కోత మురళి, గ్రామ పెద్దలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడీ మతోన్మాద వైఖరిని తిప్పికొడదాం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేశంలో మతోన్మాదం, ప్రాంతాల మధ్య విద్వేషం, కులాల మధ్య చిచ్చు, దేశ సంపదను కార్పొరేట్ వ్యవస్థకు ధారాదత్తం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా సంఘీభావ యాత్రను నగరంలో గురువారం నిర్వహించారు. ఇందిరా విజ్ఞాన్ భవన్ నుంచి

సంఘీభావ యాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అరసవల్లి మిల్లు జంక్షన్ వరకు చేపట్టిన యాత్రను ఆమె ప్రారంభించారు. దేశంలో మతోన్మాదాన్ని రెచ్చగొట్టాలని బిజెపి చూస్తోందని, ఆ కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి బిజెపి అనేక కుట్రలకు పాల్పడుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డి.గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, పైడి నాగభూషణరావు, పేడాడ పరమేశ్వరరావు, బస్వా షణ్ముఖరావు, కె.వి.ఎల్.ఎస్ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీలో ప్రతి ఇంటికీ కుళాయిలు వేసి మంచినీరు అందిస్తామని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మున్సిపాల్టీలో వేసవిలో తాగునీటి కోసం ఎన్నో అవస్థలు పడుతున్నారని, రూ.వంద కోట్లతో ఇంటింటికీ మంచీరు అందించాలని పనులు ప్రారంభించామని తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 14వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇంకా ఎవరైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారికి ప్రభుత్వ పథకాలు అందిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మున్సిపల్ డిఇ బల్ల హరి, మున్సిపల్ ఎఇఇ అవినాష్, ఎఎంసి చైర్మన్ పివి సతీష్ కుమార్, వైస్ చైర్మన్‌లు బోర కృష్ణారావు, మీసాల సురేష్ బాబు, స్థానిక కౌన్సిలర్ బెల్లాల శ్రీనివాసరావు, వైసిపి పట్టణాధ్యక్షులు సనపల సింహాచలం, మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులను అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ఇష్టపడి చదివితే విజయం

జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పట్టణంలోని జ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగానే లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరి జీవిత చరిత్ర సృష్టించే విధంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసే విధంగా విద్యార్థులు మెలగాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ ప్రాథమిక బాధ్యతల గురించి తెలుసుకోవాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య, ఎంపిపి బోర పుష్ప, కంచిలి ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి, జ్ఞానభారతి ఎడ్యుకేషనల్ ట్రస్టు సెక్రెటరీ సిహెచ్. జోహార్ ఖాన్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పల్లంటి చిరంజీవి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ సుల్తానా, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, ఎంపిటిసి ఆసి మందాకిని, జ్ఞానభారతి పాఠశాల ప్రిన్సిపల్ ఇందు భూషణ్ పండా పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న అధికారులు

కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పట్టణంలో కుప్ప కూలిన బాహుదా రోడ్డు వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణానికి రెండు నెలల్లో టెండరు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రోడ్ల, భవనాలశాఖ అధికారులు ఎస్‌ఇ జాన్ సుధాకర్, ఇఇ సత్యనారాయణ, డిఇ రామినాయుడు అన్నారు. కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం రూ.20 కోట్లు మంజూరు చేయడంతో కూలిన వంతెన పక్కనే అనువుగా ఉన్న స్థలాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా జాన్ సుధాకర్ మాట్లాడుతూ కూలిన వంతెన స్థానంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలిక వంతెన నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఈ తాత్కాలిక వంతెనపై భారీ వాహనాల రాకపోకలు నిషేధమని పేర్కొన్నారు. ఈ వంతెనపై ట్రాక్టర్లు వెళ్తున్నాయని, వాహనాలు వెళ్లనీయకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పిఎసిఎస్ అధ్యక్షులు నరేంద్ర యాదవ్ అన్నారు. కార్యక్రమంలో ఎఇ మోహనరావు వర్క్ ఇన్‌స్పెక్టర్ రామ పాల్గొన్నారు.

లంబోధర... తగ్గేదేలే!

మండపాల ఏర్పాట్లలో నిర్వాహకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గణపతి బొప్పా మోరియా అంటూ సాగే ఆధ్యాత్మిక, ఐక్యతా ఉత్సవానికి ఇంకా 10 రోజులు మాత్రమే ఉంది. కోవిడ్ నిబంధనలు కారణంగా ఆ మూడేళ్లలో వినాయక చవితి సందడి ప్రభావం బాగా తగ్గినట్లే కనిపించింది. ప్రస్తుతం కోవిడ్ ప్రభావం తగ్గడంతో వినాయక ఉత్సవాల ఏర్పాట్లలో అందరూ నిమగ్నమయ్యారు. వినాయక విగ్రహాల ధరలు ఈ ఏడాది అధికంగా పలుకుతున్నాయి. వీటి తయారీకి వినియోగించే మడికరకు, అలంకరణ సామగ్రి ధరలు గతంలో కంటే 50 శాతం మేరకు పెరిగాయి. వేరే ప్రాంతాల సామగ్రిని తెచ్చేందుకు రవాణా ఛార్జీలు, కూలీల రేట్లు అధికమయ్యాయి. వీటన్నింటి ప్రభావం విగ్రహాలపైనా పడుతోంది. ఎక్కువ మంది, 10, 12, 14 అడుగుల ఎత్తు విగ్రహాలను కొనుగోలు చేస్తుంటారు. 10 అడుగుల విగ్రహాల ధర గతంలో రూ.10 వేలు ఉండగా, ఇప్పుడు రూ. 16 వేలు వరకు ఉంది. ఎత్తు, అలంకరణను బట్టి ధరలు ఉంటున్నాయి. ఈ విగ్రహాల్ని స్థానికంగా మండల కేంద్రంలో తయారు చేసేవే. కోవిడ్ దెబ్బతో విగ్రహాల తయారీపై ఆధారపడిన వారు ఆర్థికంగా చితికిపోయారు. సాధారణంగా విగ్రహాల తయారీని ముందస్తు ఆర్డరు మేరకు ఆరు నెలల ముందు నుంచే ప్రారంభిస్తారు. 2020, 2021లో కోవిడ్ కారణంగా అప్పట్లో ఏర్పాటు చేసిన ప్రతిమలు విక్రయాలు జరగక, పెట్టిన పెట్టుబడి రాకపోవడంతో కళాకారులు అప్పులపాలయ్యారు. ప్రస్తుతం తయారీదారులు తగ్గడం విగ్రహాల ధరలు పెరగడానికి మరో కారణం, కోవిడ్‌తో ఆ రెండేళ్లు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం ఈ వినాయక చవితికి 8 నెలలకు ముందే పనులు ప్రారంభించారు. ఈ సారి విగ్రహాలకు డిమాండ్ బాగుందని కోటబొమ్మాళితో విగ్రహాలను తయారు చేశామని తయారీదారు కాశీనాథ్ తెలిపారు.

విగ్రహానికి వేస్తున్న రంగులు

మండపాల నిర్వహణా ప్రియం

వీధుల్లో మండపాట ఏర్పాటు ఖర్చులు తడిపి మోపెడవుతున్నాయి. 10 అడుగుల వెడల్పు 20 అడుగుల పొడవుతో మండపానికి అయ్యే ఖర్చు రూ. 10 వేలకు పైమాటే. విద్యుద్దీపాలంకరణ, స్టేజీ ఇతర పరికరాల కోసం అదనంగా వెచ్చించాల్సిందే. దీనికితోడు తాత్కాలిక విద్యుత్ సరఫరా, ఇతర అనుమతుల కోసం నిర్ణీత రుసుములు చెల్లించాల్సిందే. విగ్రహాల ధరలు గతంలో కంటే బాగా పెరిగాయి. మండపాల వద్ద ఉత్సవాలను సంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహిస్తామని కోటబొమ్మాళికి చెందిన నిర్వాహకుడు నేతింటి వెంకటరావు తెలిపారు.

పాలసీదారులకు మరిన్ని సౌకర్యాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జీవిత బీమా సంస్థలో పాలసీదారులకు మరిన్ని సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చి చర్యలు తీసుకుంటున్నామని మేనేజరు సత్యనారాయణ సాహు పేర్కొన్నారు. నగరంలోని ఎల్‌ఐసి ప్రధాన కేంద్రంలో బీమా వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అడ్మిన్ అచ్యుతవల్లితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల, కళాశాల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. పోటీల్లో జి.సంధ్య, వి.దేవీప్రసన్న, బి.ఇషితలు, వ్యాసరచన పోటీల్లో జి.భార్గవ్, కె.రామవర్ధన్ (ప్రభుత్వ హైస్కూల్), డి.కృష్ణ, పూజిత (భాష్యం), ఎం.తానిష్

బహుమతులను అందజేస్తున్న అచ్యుతవల్లి

(గీతాంజలి) విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరితో పాటు డ్రాయింగ్ పోటీల్లో డి.ఇందు (అక్స్‌ఫర్డ్), పి.నవ్యశ్రీ (శర్వాణి), జి.యోచన (బాలికల హైస్కూల్) విద్యార్థులు బహుమతులను అందుకున్నారు. కార్యక్రమంలో లక్ష్మి, శ్రీరాం, రమణారావు, శ్రీనివాస్‌కుమార్, కాంతా ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటి పన్నులు జమ చేయకున్నా ప్రశ్నించరా!

ప్రజాశక్తి- పొందూరు

పంచాయతీలో ప్రజలకు మెరుగైన సేవలందించాల్సిన పంచాయతీ కార్యదర్శి బి. వెంకటరావు తన విధులు సక్రమంగా నిర్వహించడం లేదని చేసిన ఫిర్యాదుపై చర్యలేవని తాడివలస గ్రామ సర్పంచ్ టి. మణెమ్మ ప్రశ్నించారు. పంచాయితీలో విధులకు కార్యదర్శి సక్రమంగా హాజరుకావడం లేదని, సుమారు 80 కిలోమీటర్ల దూరంలోని కొత్తూరు నుంచి రాకపోకలు సాగిస్తుండే ఆయన ఇంకేమి సేవలు అందిస్తారని ఎద్దేవా చేశారు. సకాలంలో రాకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యం సెలవులలో కార్యదర్శి వెళ్ళడంతో ఇన్చార్జి కార్యదర్శితోనే విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది వసూలు చేసిన ఇంటి పన్నులు పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా సొంతానికి వినియోగించుకున్నారని, దీనిపై సమాచార హక్కు చట్టం ప్రకారం సమాచారం అడిగినా ఇవ్వలేదని, దీనిపై ఎంపిడిఓకు, డిఎల్‌పిఒకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. తాను తెలుగుదేశం పార్టీ సర్పంచ్‌ను కావడంతో స్థానిక అధికార పార్టీ నాయకుల ప్రోత్సాహంతో ప్రోటోకాల్ పాటించకుండా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. అధికారులు పూర్తి విచారణ జరిపి పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ప్రజల దృష్టి మళ్లించడంలో జగన్ దిట్ట

మాజీ మంత్రి అప్పలసూర్యనారాయణ

అప్పలసూర్యనారాయణ

శ్రీకాకుళం అర్బన్ : సిఎం జగన్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెట్టి పాలన సాగిస్తున్నారని, ప్రజల దృష్టిని మళ్లించడానికి కొత్తకొత్త పోకడలను అవలంబిస్తున్నారని మాజీ మంత్రి, టిడిపి సీనియర్ నాయకులు గుండ అప్పలసూర్యనారాయణ ధ్వజమెత్తారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల కాలంలో జగన్ నోటి వెంట పెత్తందార్లు, పేదలని మాట్లాడుతున్నారని, ఆయన అఫిడవిట్‌లో పేర్కొన్న ఆస్తులు చూస్తే ఎవరు పేదవారో అర్థమవుతుందని అన్నారు. ఆయన మనస్తత్వం నియంతృత్వపు పోకడలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగన్‌కు ప్రజాస్వామ్యంపై, చట్టాలపై, చట్టసభలపై ఏమాత్రం గౌరవం లేదని అన్నారు.

మంత్రి అప్పలరాజు పరామర్శ

పలాస: పలాస మండలంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబ సభ్యులను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పరామర్శించారు. కేదారిపురం గ్రామ సర్పంచి తండ్రి బోడంగి లక్ష్మణరావు, మందస మండలం మకరజోల గ్రామానికి చెందిన కొండల నారాయణమ్మ, నారాయణపురానికి చెందిన మడియా రత్నాలు, గెడ్డలూరు గ్రామానికి చెందిన పిచ్చుక అప్పలమ్మ, వంక దానమ్మ, వివిఆర్ పురం గ్రామానికి చెందిన ఇప్పిలి ఎల్లమ్మ, కొత్తపల్లి గ్రామానికి చెందిన శశిరేఖ ఫాణిగ్రాహి, పోలేటి మౌనిక ఇటీవల మతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈయన వెంట దానయ్య, సర్పంచ్ బోడసింగి ధనంజయ ఉన్నారు.

నేడు బాలల హక్కుల కమిషన్ సభ్యుడి రాక

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని ఐసిడిఎస్ పరిధిలోని పలు అంగన్వాడీ కేంద్రాలు, కెజిబివి, వివిధ ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం శుక్రవారం సందర్శించనున్నారని ఐసిడిఎస్ సిడిపిఒ సిహెచ్.ఝాన్సీబాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం స్థానిక వెంకటేశ్వర కళ్యాణ వేదిక వద్ద బాల్య వివాహాలు నిరోధక చట్టం 2006, జిఒ నంబరు 31పై స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయాల మహిళా సంరక్షణ, సంక్షేమ, విద్యా, ఆరోగ్య కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది, అధికారులతో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు హాజరుకావాలని సూచించారు.

అచ్చెన్నతో లక్ష్మీదేవి

అచ్చెన్నను కలిసిన లక్ష్మీదేవి

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడును శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మిదేవి స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితిని అచ్చెన్న అడిగి తెలుసుకున్నారు. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నియోజకర్గంలో ప్రతిఇంటికీ చేరేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆమెకు సూచించారు. అలాగే కోటబొమ్మాళి మేజర్ పంచాయతీ పరిధిలో పలువురు టిడిపి నాయకులు అచ్చెన్నను కలిశారు. కార్యక్రమంలో లొట్టి రాహుల్ పాల్గొన్నారు.

పోస్టర్‌ను అందజేస్తున్న కళా వెంకటరావు

జె.ఆర్ పురంలో 'భవిష్యత్‌కు గ్యారంటీ'

ప్రజాశక్తి- రణస్థలం

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర ప్రజలకు భవిష్యత్‌పై గ్యారంటీ అని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలంలోని జె.ఆర్.పురంలో ష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి బాండ్ పత్రాలను అందజేశారు. ప్రతి కుటుంబానికీ ఎంత మేరకు లబ్ధిపొందుతారో తెలియజేసేలా పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సిబ్బంది

బదిలీ మరో మజిలీ

ప్రజాశక్తి- కవిటి

ఉపాధ్యాయునికి తన వృత్తి జీవితంలో బదిలీ అనేది ఓ మజిలి అని జగతి సర్పంచ్ పూడి ప్రసాదరావు, వైస్ ఎంపిపి పూడి నేతాజీ అన్నారు. మండలంలోని జగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి ఇటీవల వేరే పాఠశాలలకు బదిలీ అయిన పలువురు ఉపాధ్యాయులను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్లిన హెచ్ఎం డి.అర్జునుడు, ఉపాధ్యాయులు బి.జయరాం, మొర్రి గోపి, టి.జానకిరావు, ఎస్.శ్రీలత, పి.సునీల్, జానకిరామ్, ఊర్మిళ కుమారి, కె.ఢిల్లేశ్వరరావు, పి.లహరిలను కూడా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.వి.రమణమూర్తి, వెంకటేశం, బి.నారాయణమూర్తి, డి.బాబూరావు, బి.నూకరాజు పాల్గొన్నారు.



లక్ష్మణరావును సన్మానిస్తున్న పగడాలమ్మ

నిబద్ధతతోనే గురువులకు గుర్తింపు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సమయపాలన, నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన ఉండడం వల్లే ఉపాధ్యాయుడిగా లక్ష్మణరావుకు మంచి గుర్తింపు వచ్చిందని జెడ్‌పి వైస్‌చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, టెక్కలి డివిజన్ డిప్యూటీ విద్యాశాఖ అధికారిని పగడాలమ్మ అన్నారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.హరిబాబు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి లక్ష్మణరావుకు గురువారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి మండల యువజన నాయకులు పాలిన ఉమామహేష్, ఉపాధ్యాయులు ఎన్.నాగరాజు, సిహెచ్.ఉమారావు, పి.ఢిల్లేశ్వరరావు, కె.సీతమ్మ, కె.సత్యరాజ్, రషీద్, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధులపై అవగాహన

పలాస: గర్భకోశ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని టెక్కలి పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి.జయరాజ్ అన్నారు. పలాస ప్రాంతీయ పశు వైద్య కార్యాలయంలో పాడి రైతులకు గురువారం శిక్షణ ఇచ్చారు. పశువుల్లో గర్భకోశ వ్యాధులు ఉంటే పాడి రైతు ఆర్థికంగా నష్టపోతారని, ఏడాదికి ఒక దూడ ఉంటే పాడి పరిశ్రమ అభివృద్ధితో పాటు పశువులు ఆరోగ్యంగా ఉంటాయని అన్నారు. అనంతరం పశువు ఆరోగ్య కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ ఉమాభారతి, డాక్టర్ మధుబాబు, ఏరియా వెటర్నరీ ఆస్పత్రి అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమతుల ఆహారం తీసుకోవడం ద్వారానే మంచి ఆరోగ్యం సాధ్యమవుతుందని మెడికవర్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ దానేటి శ్రీధర్ పేర్కొన్నారు. ఆస్పత్రిలో నిర్వహించిన జాతీయ పౌష్టికాహార వారోత్సవాలు గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా సిబ్బంది, రోగుల సహాయకులకు పౌష్టికామారం ప్రాధాన్యతను వివరించారు. ప్రధానంగా మానవ శరీరానికి పౌష్టికాహారం తీసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. విటమిన్లు, కార్బోహైడ్రెడ్లు, మినరల్ ప్రాధాన్యత క్రమంలో తీసుకోవాలన్నారు. ఆహారం మితంగా తిన్నా, అమితంగా తిన్నా ఆరోగ్యానికి ముప్పు తప్పదని హెచ్చరించారు. అందువల్ల నిర్ణీత సమయంలో

మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

అవసరమైన మేరకు పూర్తి పోషక విలువ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల్లో రక్తహీనత లేకుండా తగిన పోషకాహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈనెల 1 నుంచి 7వరకు 'జాతీయ పోషకాహార వారోత్సవాలను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

కవిటి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియ విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి కడియాల పద్మ, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎఎంసి వైస్ చైర్మన్ వై.నీలయ్య, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు దేవరాజ్ సాహు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, రెడ్డి జెఎసి కార్యదర్శి బర్ల నాగభూషణం, ఎంపిడిఒ పి.సూర్యనారాయణరెడ్డి, ఎఇ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మండలం, మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన పింఛన్లను జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పడ నారాయణమ్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దివ్య భారతి, వైస్ ఎంపిపి దువ్వు వివేకానంద, కో-ఆప్షన్ మెంబర్ సయ్యద్ సుల్తానా పాల్గొన్నారు.

ఎరువుల పంపిణీ

ఇచ్ఛాపురం : వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం తప్ప మరొకటి తెలియదని పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ అన్నారు. గురువారం స్థానిక పిఎసిఎస్‌లో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పి.ఎ.సి.ఎస్. అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్ మాట్లాడుతూ ఇది రైతు పక్షపాతి ప్రభుత్వమని, అందుకే 1038 రూపాయల ప్రభుత్వ సబ్సిడీ మినహాయించి రూ.266లకు రైతులకు ఎరువులు అందజేస్తుదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ప్రతినిధి పిలక సంతోష్, ఇచ్ఛాపురం వైస్ ఎంపీపీ దువ్వు వివేకానంద రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు బచ్చు జగన్, నీలపు ఢిల్లీ, ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్, ఇసురు తులసీరాం, నీలాపు సారధి, ఎంపీటీసీ ప్రతినిధి ప్రేమ్ కుమార్ యాదవ్, పి.ఎ.సి.ఎస్. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కిడ్నీ మార్పిడికి ఆర్థికసాయం

ఆర్థికసాయం అందిస్తున్న ఫాస్టర్లు

కవిటి : కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన సంతోష్ కుమార్ రౌలో కిడ్నీ మార్పిడి చికిత్స కోసం స్థానిక అబ్దుల్ కలాం ఫౌండేషన్ సభ్యులు ఆర్థిక సాయం అందించారు. వివరాల్లోకి వెళ్తే...సంతోష్ కుమార్ రౌలో కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విశాఖలో చికిత్స పొందుతున్నాడు. కిడ్నీ మార్పిడి చేస్తే సంతోష్ కుమార్ ఆరోగ్యంగా మెరుగవుతుందని వైద్యులు చెప్పడంతో అతని పెద్దనాన్న తన కిడ్నీ ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. అయితే ఈ మార్పిడి చికిత్స ఖర్చుతో కూడుకున్నది కావడంతో బాధితులు దాతల సాయం కోరారు. దీంతో కలాం ఫౌండేషన్ సభ్యులు కష్ణమూర్తి రౌలో, కొరికాన ఆనందరావు గురువారం ఆసుపత్రికి చేరుకుని బాడుతునికి రూ.16 వేలు అందించారు. అంతేకాకుండా దాతలు ఉదారంగా స్పందించి సంతోష్ కుమార్‌కు అండగా నిలవాలని కోరారు.

మృతుని కుటుంబానికి...

మెళియాపుట్టి: మండలంలోని తంగినిలో రామారావు భార్య పాస్టర్ కస్తూరమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం విషయం తెలుసుకున్న జిల్లా పాస్టర్ సంఘం తరుపున ఆమె కుటుంబానికి రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. కృపానందం, సల్మాన్, జోసెఫ్ బిచిత్ర, చంద్రపాల్, మోహనరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి వైఎస్ఆర్ బీమా

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పురపాలక సంఘం బెల్లుపడ కాలనీ-2 సచివాలయం పరిధిలోని 12వ వార్డులో నివసిస్తున్న గాలి చిన్నారావు ఇటీవల అనారోగ్యంతో మరణించారు.. ఆయన నామిని అయిన సోదరి గాలి కళావతికి వైఎస్ఆర్ బీమా కింద దహన సంస్కారం నిమిత్తం తక్షణ సహాయం రూ:10,000లను మునిసిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి చేతుల మీదుగా గురువారం అందించారు. మిగిలిన రూ.90,000లను నామినీ గాలి కళావతి అకౌంట్‌లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి 12వ వార్డు ప్రతినిధి బుడుపు త్రినాధ్, వార్డ్ సచివాలయం వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీ బట్టి.బాలకృష్ణ, వలంటీర్ గిన్ని హరి పాల్గొన్నారు.

సచివాలయాలతో సమస్యల పరిష్కారం

లావేరు: జగనన్న ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలు ఆయా గ్రామాల పరిధిలోనే వారి సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గుర్రాలపాలెం పంచాయతీలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం, రూ.17.50 లక్షలతో నిర్మించిన నూతన రైతు భరోసా కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సబ్సిడీ కింద విత్తనాలు రైతు భరోసా కేంద్రంలో ఉంటున్నాయని తెలిపారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాలంటీర్లు, సచివాలయాల ద్వారా నేరుగా ప్రజల ఇంటివద్దకే చేరవేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసా సీతంనాయుడు, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు దనన్నా రాజినాయుడు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు చాంద్ భాష, ఎంపిటిసి జనపాల భానూజీరావు, పాతకుంకాం సర్పంచ్ శెట్టికం వెంకటరమణ, ఎంపిడిఒ సురేష్‌కుమార్, పంచాయతీ జెఇ అప్పన్న పాల్గొన్నారు.

త్రినాథ్‌పేటలో అగ్నిప్రమాదం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం బెల్లుపడలో త్రినాథ్‌పేటలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగి సుమారు రెండు లక్షల రూపాయలు విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయి. త్రినాథ్‌పేటలో నివాసం ఉంటున్న గుంజా లక్ష్మీ ఇంట్లో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. అగ్ని మాపక కేంద్రానికి ఫోన్ చేసినా సకాలంలో స్పందించకపోవడంతో స్థానికులే మంటలను అదుపులోకి తెచ్చేందుకు కషి చేశారు. ఆ తర్వాత అగ్నిమాపక సిబ్బంది వచ్చి మిగిలిన మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయని బాధితురాలు బోరుమని విలపించారు. విషయం తెలుసుకున్న వార్డు కౌన్సిలర్ ప్రతినిధి బి.త్రినాథ్ బాధిత కుటుంబానికి అవసరమైన రేషన్ సరుకులు, కొంత నగదు అందించారు. జనసేన ఇన్‌ఛార్జీ దాసరి రాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రేషన్ సరుకులు అందించారు.

ఉమాపతికి మొక్కను అందజేస్తున్న నూతన దంపతులు

వివాహ వేడుకలో పచ్చదనం

టెక్కలి రూరల్ : వివాహ వేడుకల్లో బహుమతులు ఇవ్వడం సహజమే.. ఆదిత్య కల్యాణ మండపంలో టెక్కలికి చెందిన హోమియోపతి వైద్యులు నంబాల విద్యాసాగర్, కవిటి అనూష వివాహం జరిగింది. ఈ వేడుకలో మొక్కలు పంచే కార్యక్రమం చేపట్టారు. మొదటి మొక్క మాజీ ఐజి సత్తా ఉమాపతికి సుమారు 12 వందల మొక్కలను పంపిణీ చేశారు.

'అన్న క్యాంటీన్'కు ఆర్థికసాయం

కోటబొమ్మాళి: స్థానిక మండల కేంద్రంలో టిడిపి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు విశాఖపట్నం పెద్దవాల్‌టేర్, దక్షిణ నియోజకవర్గానికి చెందిన జి.వి.రామచంద్రరావు గురువారం రూ.లక్ష అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడుకు మండల పార్టీ కార్యాలయంలో గురువారం చెక్కును అందజేశారు. అన్న క్యాంటీన్ ద్వారా వందలాది మంది పేదలకు రూ.5లకే రుచికరమైన భోజనం అందిస్తున్నారని అన్నారు. అలాంటి అన్న క్యాంటీన్‌కు తన వంతు సహాయ సహకారం అందించడం సంతోషకరంగా ఉందన్నారు.

వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

క్రీడాకారులతో సర్పంచ్ చిన్నారెడ్డి

ఎచ్చెర్ల : విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎస్.ఎస్.ఆర్.పురం సర్పంచ్ ప్రతినిధి దుంప చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని సంతసీతారాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు బి.అనురాధ అధ్యక్షతన పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గాలి అప్పలగురువులు సౌజన్యంతో గురువారం 35 మందికి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలపై శ్రద్ధ కనబరచాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల వ్యాయామోపాధ్యాయులు అన్నపు రాజగోపాలరావు, అలపాన బుజ్జి, సత్యనారాయణ, గోవింద, అప్పలరెడ్డి, అసిరినాయుడు, ఉపాధ్యాయులు ఆనందరావు, కె.వి.రమణమూర్తి, ఆదినారాయణ, రాజారావు, సూర్యకళ, బాబూరావు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందంజ

ప్రజాశక్తి- రణస్థలం

ఈ ప్రాంత ప్రజలకు సేవా కార్యక్రమాలు అందించడంలో పైడి భీమవరంలోని అరొబిందో ఫార్మా, అనుబంధ సంస్థ అయిన శ్రేయాస్ ఇండస్ట్రీస్ ఆక్సిస్ క్లినికల్స్ లిమిటెడ్ ముందంజలో ఉంటోందని ఆ పరిశ్రమ ప్రతినిధులు పి.గోపాల్ రెడ్డి, కె.కమలాకర్ రెడ్డి అన్నారు. మండలం లోని కొండములగాంలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కి సామజిక బాధ్యతలో భాగంగా ఆసుపత్రి సిబ్బందికి, రోజూ వచ్చే రోగులందరికీ ఉపయోగపడేలా రూ.3 లక్షలు విలువైన 1000 లీటర్ల ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి గురువారం ప్రారంభించారు. రణస్థలం సబ్ రిజిస్ట్రార్

ఆర్ఒ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న గోపాల్‌రెడ్డి, కమలాకర్ రెడ్డి

కార్యాలయానికి రూ.5.లక్షల విలువ చేసే కంప్యూటర్లు, ఆఫీస్ ఫర్నిచర్‌ను సబ్ రిజిస్టర్ కె. వేణుకి అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.వి. ప్రసాదరావు, డాక్టర్ ప్రసన్న, ఆసుపత్రి సిబ్బంది, సబ్ రిజిస్టర్ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు. ఆరోబిందో మేనేజ్మెంట్ హెడ్ నిత్యానంద రెడ్డికి, శరత్ చంద్ర రెడ్డికి పలువురు ధన్యవాదాలు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న పధాన్

రూ.200 కోట్ల రుణ లక్ష్యం

బ్యాంకు ఆఫ్ బరోడా రీజనల్ మేనేజర్ పధాన్

పలాస: పలాస బ్రాంచ్‌లో ఈ ఏడాది రూ. 200 కోట్లు రుణాలు మంజూరు చేసేందుకు లక్ష్యం కాగా, ఇప్పటి వరకు సుమారు రూ.వంద కోట్లు రుణాలు మంజూరు చేశామని బ్యాంకు ఆఫ్ బరోడా అసిస్టెంట్ జనరల్ మేనేజర్, విశాఖపట్నం రీజనల్ మేనేజర్ పి.ఎం.పధాన్ తెలిపారు. కాశీబుగ్గ ప్రయివేట్ కళ్యాణ మండపంలో గురువారం స్థానిక వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస బ్రాంచ్‌లో వ్యాపార లావాదేవీలు భేష్‌గ్గా జరుగుతున్నాయని చెప్పారు. రైస్ మిల్లర్లకు 0.4 శాతం బ్యాంకు గ్యారంటీ కమిషన్ తీసుకుంటున్నామని చెప్పారు. ఇతర బ్యాంకుల కన్నా తక్కువ వసూలు చేస్తున్నామని చెప్పారు. జీడి వ్యాపారులకు 8.90 శాతం వడ్డీపై వ్యాపార రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. గృహాలపై 8.60 శాతం వడ్డీతో రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. జీడి, రైస్ మిల్లర్లకు 50 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేస్తామన్నారు. డిజిటల్ రుణాలు అందుబాటులో ఉన్నాయని, కేవలం రెండు గంటల్లో కారు రుణాలు అందిస్తామని చెప్పారు. బ్యాంకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యాపారులను కోరారు. సమావేశంలో హైదరాబాద్ జోనల్ ఎజిఎం ప్రవీణ్‌కుమార్ రాహుల్, విశాఖపట్నం ఎంఎస్ ఎంఇ రీజనల్ మేనేజర్ హన్స్ నాయక్, పలాస బ్రాండ్ మేనేజర్ ఎం.వి.ఆర్.మూర్తి, గొర్రెల నూకయ్య, సప్పటి జోగారావు పాల్గొన్నారు.